## పోస్టాఫీస్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- గోప్యతను ఉల్లంఘిస్తున్నదని ప్రతిపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై లోక్‌సభ ఎథిక్స్ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడానికి ముందు లోక్‌సభలో చర్చ జరగాలని ప్రతిపక్ష సభ్యులు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో డిమాండ్ చేశారు. పోస్టాఫీస్ సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. 125 ఏళ్ల నాటి ఈ చట్టాన్ని సవరించడం వల్ల ప్రభుత్వానికి కీలక అధికారాలు లభిస్తాయి. దేశ భద్రత, విదేశాలతో స్నేహ సంబంధాలు, శాంతిభద్రతలు, అత్యవసర పరిస్థితులు లేదా ప్రజా భద్రత వంటి సందర్భాల్లో ఏదైనా వస్తువు లేదా కవరును తెరచి చూసి, స్వాధీనం చేసుకునే అధికారం అధికారులకు లభిస్తుంది. దీని కోసం ఏదైనా అధికారికి అధికారాన్ని కట్టబెడుతూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వవచ్చు. దేశ భద్రత కోసమే ఈ నిబంధనలను ఏర్పాటు చేసినట్లు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ బిల్లును వామపక్షాలు, ఆప్, టీడీపీ, ఏఐఏడీఎంకే, ఎన్‌సీపీ ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. పార్సిళ్లను తెరచి చూసే అధికారాన్ని పోస్టల్ అధికారికి కట్టబెట్టడం వల్ల వ్యక్తిగత గోప్యత హక్కు ఉల్లంఘనకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, లీగల్ ప్రొఫెషన్‌ను క్రమబద్ధీకరించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కోర్టుల్లో న్యాయవాదులు-కక్షిదారుల మధ్య దళారులను తొలగించాలని పార్టీలకు అతీతంగా ఎంపీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.



## రాఘవ చద్దాపై సస్పెన్షన్ ఎత్తివేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ఆప్ ఎంపీ రాఘవ చద్దాపై విధించిన సస్పెన్షన్‌ను రాజ్యసభ ఎత్తివేసింది. సస్పెన్షన్ ఎత్తివేత తీర్మానాన్ని సోమవారం ఆమోదించింది. ఓ తీర్మానంపై తోటి సభ్యుల అనుమతి లేకుండానే సంతకాలు చేశారన్న ఆరోపణలపై రాఘవ చద్దాను గత ఆగస్టులో సభ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రివిలేజ్ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. రాఘవ చద్దాపై వచ్చిన ఆరోపణలు నిజమేనని కమిటీ తేల్చింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న చైర్మన్ ధన్‌కర్.. ఇప్పటికే రాఘవ చద్దా సభకు హాజరుకాకుండా 100 రోజులకుపైగా వేటు వేశానని, అయితే ఇప్పుడు ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ్యులు మద్దతు తెలుపడంతో ఈ వేటును తొలగిస్తున్నానని చెప్పారు. చైర్మన్ నిర్ణయంపై రాఘవ చద్దా సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రచారానికి సైన్యాన్ని వాడుకోవడంపై వివరణ ఇవ్వండి

**కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ప్రభుత్వ పథకాలు, చేపట్టిన పనులను ప్రచారం చేయడానికి సైన్యాన్ని, ప్రభుత్వ ఉద్యోగులను ఉపయోగించుకోవడంపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా సైన్యాన్ని, ఉద్యోగులను వాడుకోవడాన్ని వ్యతిరేకిస్తూ మాజీ బ్యూరోక్రాట్ ఈఏఎస్ శర్మ, జగ్‌దీప్ ఎస్ ఛోకర్ దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం కోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి రక్షణ శాఖ పథకాలను ప్రచారం చేయాలని సైన్యాన్ని కేంద్రం ఆదేశించిందన్నారు. అలాగే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పబ్లిక్ సర్వెంట్లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి కేంద్ర పథకాలను ప్రచారం చేయిస్తున్నట్టు పేర్కొన్నారు. వాదనలు విన్న కోర్టు.. వివరణ ఇవ్వాలంటూ కేంద్రాన్ని ఆదేశించింది.

# జెడ్‌పీఎం జయభేరి

## మిజోరంలో 40కిగాను 27 స్థానాల్లో ఘన విజయం

**అధికార ఎంఎన్‌ఎఫ్‌కు పరాభవం.. సీఎం, 9 మంది మంత్రులు ఓటమి**

**రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా జెడ్‌పీఎం అగ్రనేత లాల్‌దుహోమా!**

ఐజ్వాల్, డిసెంబర్ 4: ఈశాన్య రాష్ట్రం మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఎన్నికల్లో జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) ఘన విజయం సాధించింది. అసెంబ్లీలోని మొత్తం 40 స్థానాలకు ఈ పార్టీ 27 స్థానాల్లో విజయఢంకా మోగించింది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్) ఘోర పరాజయం పాలైంది. ఆ పార్టీకి కేవలం 10 స్థానాలు ఇచ్చిన ప్రజలు.. ఈ సారి ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు. ఇక జాతీయ పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌లు రాష్ట్రంలో పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. బీజేపీ రెండు స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ కేవలం ఒక్క సీటులోనే గెలుపొందింది. 2018 ఎన్నికల్లో ఐదు స్థానాల్లో గెలిచిన హస్తం పార్టీ.. ఈసారి ఒక్క స్థానానికే పరిమితం కావడం గమనార్హం.

### సీఎం సహా మెజార్టీ మంత్రుల పరాజయం

ఎంఎన్‌ఎఫ్ చీఫ్, సీఎం జోరంతంగా, డిప్యూటీ సీఎం టాన్లుయాతో సహా క్యాబినెట్‌లోని 9 మంది మంత్రులు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఐజ్వాల్ ఈస్ట్-1 స్థానం నుంచి పోటీచేసిన జోరంతంగా జెడ్‌పీఎం అభ్యర్థి లల్తాన్సంగా చేతిలో 2,101 ఓట్ల తేడాతో ఓడిపోయారు. జెడ్‌పీఎం నుంచి సీఎం అభ్యర్థిగా ఉన్న ఆ పార్టీ కీలక నేత లాల్‌దుహోమా సెర్చిప్ స్థానం నుంచి ఘన విజయం సాధించారు. మిజోరంలో ఓట్లు తక్కువగా ఉండటంతో దాదాపు అన్ని స్థానాల్లో 2-5 రౌండ్లలో లెక్కింపును పూర్తిచేసిన అధికారులు, గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించారు. ఎన్నికల ఫలితాల్లో సంపూర్ణ మెజార్టీ రావడంతో ప్రభుత్వం ఏర్పాటుకు జెడ్‌పీఎం సిద్ధమవుతున్నది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో మంగళవారం సమావేశం ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే సప్దాంగా వెల్లడించారు. ఇంతటి ఘన విజయం అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ అధ్యక్షుడు లాల్‌దుహోమా

### ఐపీఎస్ నుంచి సీఎం స్థాయికి..

మిజోరం ఎన్నికల్లో జెడ్‌పీఎంను విజయం దిశగా నడిపించిన ఆ పార్టీ సీఎం అభ్యర్థి 73 ఏండ్ల లాల్‌దుహోమా జీవితంలో అనేక మలుపులు ఉన్నాయి. ఒకసారి ఎంపీ, మరోసారి ఎమ్మెల్యేగా పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హత వేటు ఎదుర్కొన్నారు. 1977లో ఐపీఎస్‌గా ఎంపికైన లాల్‌దూహోమా.. 1982లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీకి సెక్యూరిటీ ఇన్‌చార్జిగా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఆయన.. 1984లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1988లో కాంగ్రెస్‌ను వీడటంతో పార్టీ ఫిరాయింపుల చట్టం కింద మొదటిసారిగా ఎంపీగా ఆయనపైనే అనర్హత వేటు పడింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ఆయన జెడ్‌పీఎం పార్టీ కార్యాకలాపాల్లో పాల్గొంటున్నారంటూ ఎంఎన్‌ఎఫ్ ఎమ్మెల్యేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాల్‌దుహోమాపై 2020లో స్పీకర్ అనర్హత వేటు వేశారు. ఆ తర్వాత ఆయన సెర్చిప్ స్థానం నుంచి ఉప ఎన్నికల్లో గెలిచారు. జోరం నేషనలిస్టు పార్టీని స్థాపించిన లాల్‌దుహోమా.. తర్వాత దాన్ని పలు ప్రాంతీయ పార్టీలు కూటమిగా ఉన్న జెడ్‌పీఎంలో చేర్చారు.



గవర్నర్ హరిబాబుకు రాజీనామా లేఖ అందజేస్తున్న సీఎం జోరంతంగా

**మిజోరం (మొత్తం స్థానాలు 40 మ్యాజిక్ మార్క్-21)**

| పార్టీ | గెలిచిన స్థానాలు (2023) | 2018 ఎన్నికల్లో గెలిచిన సీట్లు |
|---|---|---|
| జెడ్‌పీఎం | 27 | 8 |
| ఎంఎన్‌ఎఫ్ | 10 | 26 |
| బీజేపీ | 2 | 1 |
| కాంగ్రెస్ | 1 | 5 |

## రాజేతో 50 మంది ఎమ్మెల్యేల భేటీ

- రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి ఎంపికపై సస్పెన్స్
- ఇంకా నిర్ణయం వెలువరించని బీజేపీ




జైపూర్, డిసెంబర్ 4: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత.. కొత్త సీఎం ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతున్నది. ముఖ్యమంత్రి అభ్యర్థిపై కమలం పార్టీ ఇంకా నిర్ణయం తీసుకోని నేపథ్యంలో రేసులో ఉన్న పలువురు నేతలు వ్యూహాత్మక మౌనం పాటిస్తూ సీఎం సీటును దక్కించుకొనేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీ అగ్రనేతలు మోదీ, అమిత్‌షా, నడ్డాలతో చర్చించేందుకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సీపీ జోషి, ఇన్‌చార్జి అరుణ్ సింగ్ ఢిల్లీ చేరుకొన్నారు. మరికొందరు సీనియర్ నేతలు, ఎంపీలు కూడా చేరుకొంటున్నారు. ఓవైపు సీఎం అభ్యర్థిని ఎంపిక చేసేందుకు బీజేపీ అగ్రనాయకత్వం సమాలోచనలు చేస్తున్న తరుణంలో సోమవారం మాజీ సీఎం వసుంధరా రాజేను ఆమె నివాసంలో కొత్తగా గెలిచిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు కలువడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. భేటీ అనంతరం ఎమ్మెల్యే రామ్‌స్వరూప్ లంబా మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ విజయానికి ప్రధాని మోదీ, వసుంధరా రాజే ఎంతో కష్టపడ్డారని పేర్కొన్నారు. రాజేకు కొత్తగా గెలిచిన 115 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందన్నారు. అయితే ఎమ్మెల్యేలంతా కేవలం మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చారని వసుంధరా రాజే కార్యాలయం చెప్పడం గమనార్హం.

## ఏడుసార్లు ఎమ్మెల్యే.. ఓడించిన కూలీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ఛత్తీస్‌గఢ్‌లో ఓ సాధారణ పౌరుడు, కూలీ చేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్న ఈశ్వర్ సాహు అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాడు. జెయింట్ కిల్లర్‌గా మారాడు. ఏడు సార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేసిన రవీంద్ర చౌబేను ఎన్నికల్లో మట్టికరిపించాడు. కొంతకాలం కిందట మూకదాడిలో ఈశ్వర్ సాహు కుమారుడు మరణించాడు. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకోవాలనుకున్న బీజేపీ సాహుకు టికెట్ ఇచ్చింది. దీంతో 5,000 ఓట్ల మెజారిటీతో రవీంద్ర చౌబేపై ఈశ్వర్ సాహు గెలిచాడు.

## రాజకుటుంబీకుల్లో ఒక్కరూ నెగ్గలే

రాయ్‌పూర్, డిసెంబర్ 4: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారి రాజకుటుంబాల నుంచి ఒక్కరు కూడా ఎమ్మెల్యేగా గెలువలేదు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నుంచి ముగ్గురు చొప్పున, ఆప్ నుంచి ఒక్కరు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అయితే ఈ ఏడుగురిలో ఒక్కరు కూడా గెలువలేదు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన టీఎస్ సింగ్‌దేవ్ 94 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఓడిన ఆరుగురిలో అంబికా సింగ్‌దేవ్, దేవేంద్ర బహదూర్ సింగ్, సాన్‌యోగితాసింగ్ జుదేవ్, ప్రబల్ ప్రతాప్ సింగ్ జుదేవ్, సంజీవ్ షా, ఖడ్గ్‌రాజ్ సింగ్ ఉన్నారు.



గాటెమాల తీరంలోని పసిఫిక్ మహాసముద్రం అడుగుభాగంలో అత్యంత పెద్దదైన పర్వతాన్ని పరిశోధకులు గుర్తించారు. 1,600 మీటర్ల ఎత్తు ఉన్న దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా టవర్‌కు ఈ పర్వతం రెండింతలు ఉన్నట్టు కనుగొన్నారు.

## మళ్లీ రగిలిన మణిపూర్

- మిలిటెంట్ గ్రూపుల మధ్య కాల్పులు
- 13 మంది దుర్మరణం
- మయన్మార్ సరిహద్దులో ఘటన

ఇంఫాల్, డిసెంబర్ 4: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మళ్లీ ఘర్షణలు రేగాయి. సోమవారం రెండు మిలిటెంట్ గ్రూపులు పరస్పరం కాల్పులకు తెగబడ్డాయి. టెంగ్నోపాల్ జిల్లాలో ఇరు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో 13 మంది మిలిటెంట్లు చనిపోయారని జిల్లా అధికారులు వెల్లడించారు. మయన్మార్ సరిహద్దుకు ఆనుకొని వున్న లైథు గ్రామంలో ఈ ఘటన జరిగినట్టు చెప్పారు. 'కొంతమంది మిలిటెంట్స్ మయన్మార్‌కు వెళ్తుండగా, ఆ ప్రాంతంలో ఆధిపత్యం కలిగిన మరో మిలిటెంట్ గ్రూప్ మెరుపుదాడికి దిగింది' అని జిల్లా అధికారి ఒకరు తెలిపారు. కాల్పుల సమాచారం అందిన వెంటనే భద్రతా బలగాలు అక్కడికి చేరుకోగా, ఘటనాస్థలంలో 13 మృతదేహాలు లభ్యమయ్యాయి. చనిపోయిన వారంతా స్థానికులు కాదని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మే నెల ప్రారంభం నుంచి మణిపూర్ రెండు జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న విషయం తెలిసిందే.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం


- నాలుగు నెలల్లోగా దేశవ్యాప్తంగా అందుబాటులోకి
- కేంద్ర రవాణా శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: రోడ్డు ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా నగదు రహిత వైద్య చికిత్స సదుపాయాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. మూడు నుంచి నాలుగు నెలల్లోగా ఈ సదుపాయం అందుబాటులోకి రావచ్చని కేంద్ర రవాణా, రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ సోమవారం వెల్లడించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాఫిక్ ఎడ్యుకేషన్ (ఐఆర్‌టీఈ) ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తూ.. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో అత్యధికం భారత్‌లోనే నమోదవుతున్నాయని గుర్తుచేశారు. సవరించిన మోటర్ వాహన చట్టం-2019లో భాగంగా ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్య చికిత్స సదుపాయాన్ని కల్పించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు దీన్ని అమలు చేస్తున్నాయని, ఇప్పుడు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలిసి రహదారుల శాఖ దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో దీన్ని అమలు చేయనున్నదని వివరించారు.

## దేశంలో రోజుకు 78 హత్యలు

**మహిళలపై పెరిగిన నేరాలు.. ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడి**

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్సీఆర్బీ) తాజా నివేదికలో ఆందోళనకర విషయాలు వెల్లడైంది. దేశవ్యాప్తంగా రోజుకు 78 హత్యలు చోటు చేసుకొంటున్నట్టు పేర్కొన్నది. ఈ హత్యాకాండ రేటు దేశవ్యాప్తంగా ప్రతి లక్ష జనాభాకు 2.1గా ఉన్నదని, ఇది జార్ఖండ్‌లో అధికంగా 3.6గా ఉన్నదని తెలిపింది. మహిళలు, చిన్నారులు, ఎస్సీ, ఎస్టీలపై కూడా నేరాలు పెరిగాయని తెలిపింది. 2022లో మహిళలపై నేరాలకు సంబంధించి 4,45,256 కేసులు నమోదయ్యాయని(2021తో పోలిస్తే 4% పెరుగుదల), గంటకు 51 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయ్యాయని పేర్కొన్నది.




# మిగ్‌జాం బీభత్సం

- తుఫాన్ ధాటికి తమిళ నాడు, ఆంధ్రప్రదేశ్ అతలాకుతలం
- చెన్నై నగరాన్ని ముంచెత్తిన వాన
- వరదలో కొట్టుకుపోయిన కార్లు
- నిలిచిన విమాన రాకపోకలు
- నేడు ఉదయం ఏపీలో తీరం దాటనున్న తుఫాన్
- కోస్తా జిల్లాల్లో హై అలర్ట్
- తెలంగాణలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు




సోమవారం భారీ వర్షాల కారణంగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఎదుట నిలిచిన నీళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)/చెన్నై : మిగ్‌జాం తుఫాన్ తాకిడికి తమిళనాడు రాజధాని చెన్నై అతలాకుతలమైంది. భీకర గాలులు, కుండపోత వానతో చెన్నై సహా పలు జిల్లాల్లో అనేక ప్రాంతాలు నీటమునిగాయి. సోమవారం నగరంలో కురిసిన భారీ వర్షాల ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లపైకి వరదనీరు రావటంతో కార్లు, ఇతర వాహనాలు కొట్టుకుపోయాయి. చెన్నై ఎయిర్‌పోర్టు రన్‌వేపైకి భారీగా వరదనీరు చేరింది. దీంతో విమాన రాకపోకల్ని అధికారులు నిలిపివేశారు. 16 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు ప్రకటించారు. పదుల సంఖ్యలో విమానాల్ని దారిమళ్లించినట్టు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి వరకు విమానాశ్రయంలో విమాన రాకపోకల్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. తుఫాన్ సంబంధిత ఘటనల్లో చెన్నైలో ఐదుగురు మరణించారు.

### విద్యాసంస్థలకు సెలవు

2015నాటి తుఫాన్ విపత్తును గుర్తుకుతెస్తూ చెన్నైలో మిజ్‌జాం బీభత్సం సృష్టించింది. రోడ్లపై పెద్దయెత్తున వరద నీరు చేరడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. అనేక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. తుఫాన్ ప్రభావిత జిల్లాల్లోని విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు, బ్యాంకులకు మంగళవారం సెలవు ప్రకటించారు.

### తెలంగాణలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు..

రాష్ట్రంలో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, జనగామ, యాదాద్రి-భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. వరంగల్, హన్మకొండ, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, జనగామ, యాదాద్రి-భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేటతో పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీచేసింది.

### నెల్లూరు, బందర్ మధ్య..

ఏపీలో కోస్తాంధ్ర తీరప్రాంతం ఆనుకుని నెల్లూరు నుంచి బందరు వైపు సాగుతున్న మిగ్‌జాం తుఫాను మంగళవారం ఉదయం తీరం దాటే అవకాశమున్నట్టు భారత వాతావరణ శాఖ తెలిపింది. బాపట్ల-దివిసీమ మధ్య తీరం దాటుతుందని అధికారులు పేర్కొన్నారు. తుఫాను కారణంగా నెల్లూరు, తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరిక జారీ చేసింది. దక్షిణ మధ్య రైల్వే దాదాపు 150 రైళ్లను రద్దు చేసింది. తుఫాను తీరం దాటే సమయంలో భారీ విధ్వంసం ఉంటుందని దివిసీమ వాసులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను అప్రమత్తతపై కలెక్టర్లతో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## స్పాటిఫైలో 17 శాతం ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ప్రముఖ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ స్పాటిఫై 17 శాతం మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు ప్రకటించింది. ఆర్థిక అనిశ్చితుల కారణంగా ఖర్చులు తగ్గించుకొనేందుకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నట్టు వెల్లడించింది. ఈ విషయాన్ని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో డానియేల్ ఏక్ సోమవారం సోషల్ మీడియాలో తెలిపారు. స్పాటిఫైలో ప్రస్తుతం 8,800 మంది పనిచేస్తుండగా, తాజా నిర్ణయం ప్రభావం 1,500 మంది ఉద్యోగులపై పడనున్నది. ఏడాది వ్యవధిలోనే ఈ సంస్థ లేఆఫ్స్ ప్రకటించడం ఇది మూడోసారి. ఈ సంస్థ జనవరిలో తొలిసారిగా 600 మంది (6 శాతం) ఉద్యోగులను, జూన్‌లో రెండోసారి మరో 200 మంది (2 శాతం) ఉద్యోగులను తొలగించింది. ఇప్పుడు మూడోసారి మరో 1500 మందిని తీసివేయన్నట్టు ప్రకటించింది.

## వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా 'రిజ్'

లండన్: రొమాంటిక్ అప్పీల్‌ను సూచించే 'రిజ్..' అనే పదం వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా 'ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్' (ఓయూపీ) ఎంపికచేసింది. ఈ ఏడాది అత్యంత ప్రాచుర్యంలో నిలిచిన 8 పదాల్ని ఎంపిక చేసిన ఓయూపీ, గతవారం ఇందు లో ఫేవరెట్ పదంపై ఓటింగ్ నిర్వహించింది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ ఓటింగ్‌లో బ్రిటిష్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫైనల్స్‌లో 'రిజ్' మొదటిస్థానంలో నిలిచింది. 2023 ఏడాదికి సంబంధించి మానసిక స్థితి, నైతికత, ఆందోళనను 'రిజ్..' ఉత్తమంగా ప్రతిబింబించిందని ఓయూపీ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

# ఉప్పుతో మరో ముప్పు

- బీపీ, గుండె జబ్బులే కాదు.. పొట్ట సంబంధిత క్యాన్సర్ రిస్క్
- తాజా అధ్యయనంలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): డాక్టర్ల వద్దకు వెళ్లిన ప్రతిసారీ తినే ఆహారంలో ఉప్పు తగ్గించమని చెబుతుంటారు. వయసు మళ్లిన వారు అయితే మరింత జాగ్రత్తగా ఉండాలని మరీ నొక్కిచెబుతారు. ఎందుకంటే ఉప్పును అధికంగా తీసుకోవడం వల్ల బీపీతో(రక్తపోటు) పాటు గుండె సంబంధిత సమస్యలను పెంచుతుందని చెబుతారు. అయితే తాజాగా అధికంగా ఉప్పును తినడం వల్ల పొట్ట సంబంధిత క్యాన్సర్ వచ్చే అవకాశం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రతిరోజూ 10 గ్రాముల కంటే ఎక్కువగా ఉప్పును తినడం వల్ల కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నదని, మనం రోజువారీ తినే ఉప్పు పెరిగే కొద్దీ ప్రమాదం పెరుగుతుందని జపాన్ శాస్త్రవేత్తల తాజా అధ్యయనం వెల్లడించింది. దీనిపై లోతుగా తెలుసుకోవడానికి ఎలుకలపై పరిశోధనలు నిర్వహించారు. ఉప్పు ఎక్కువవడం వల్ల కడుపులోని ఒక పొర దెబ్బతిని క్యాన్సర్‌కు దారితీస్తుందని అధ్యయన ఫలితాలు వెల్లడించాయి. గుండె సంబంధిత జబ్బులు, క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు మనం తీసుకొనే రోజువారీ ఉప్పును 6 గ్రాముల కంటే తక్కువగా ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# చిట్టితో ఉద్యోగాలకు ఎసరు!

మనుషులు గంటల్లో చేసే పనులను కూడా సెకండ్ల వ్యవధిలో చిట్టి (రోబో) పూర్తిచేయడం రజినీకాంత్ 'రోబో' సినిమాలో చూశాం. కృత్రిమమేధ(ఏఐ), రోబోటిక్స్ విప్లవంతో ఇప్పుడు అన్ని సెక్టార్లలో వాటి వినియోగం పెరిగిపోయింది. రోబోల రాకతో ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్నదా? అనే చర్చ ఇటీవలి కాలంలో ఎక్కువైంది కూడా. ఈ క్రమంలో రోబోల కారణంగా ఎలాంటి ఉద్యోగాలకు ఎక్కువగా ప్రమాదమున్నదన్న అంశంపై యూకేకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరిశోధకులు తాజాగా ఓ అధ్యయనాన్ని నిర్వహించారు.

- స్పెషల్ టాస్క్ బ్యూరో, నమస్తే తెలంగాణ

**ఏఐ, రోబోల రాకతో రిస్క్ ఎక్కువగా ఉన్న 5 ఉద్యోగాలు**

1. మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్
2. ఫైనాన్షియల్ మేనేజర్స్
3. అకౌంటెంట్స్
4. సైకాలజిస్ట్‌లు
5. పర్చేజింగ్ మేనేజర్స్



**ఏఐ, రోబో వినియోగం పెరిగినప్పటికీ ప్రమాదం అంతగా లేని ఉద్యోగాలు**

1. స్పోర్ట్స్ ప్లేయర్ ట్రైనింగ్
2. నిర్మాణ రంగంలోని డిజైనర్లు
3. న్యాయాధికారులు, పరిశోధకులు, ఆర్టిస్టులు